సాక్షి
అన్నమయ్య జిల్లా

బుధవారం । 18 । అక్టోబర్ । 2023



ముచ్చటగా మూడోసారి కృష్ణమ్మ రాక!

ఏవీఆర్ హంద్రీనీవా ప్రాజెక్టు కాలువ నిర్వహణ, గండ్లు పూడ్చివేతపై 'ఈనాడు' కట్టు కథను అల్లింది. దీనిపై ఫ్యాక్ట్ చెక్. -IIలో



డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మిద్దాం

డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మిద్దామని ఎస్పీ కృష్ణారావు అన్నారు. మంగళవారం ఎంజేఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో యువతకు అవగాహన సదస్సు నిర్వహించారు. -IIలో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.110	రూ.140
రెండోరకం	రూ.66	రూ.98



మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 268 మెట్రిక్ టన్నులు

న్యూస్‌రీల్

20న జగనన్నకు చెబుదాం

రామాపురం : మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఈనెల 20న ఉదయం 10గంటలకు జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని కలెక్టర్ గిరీషా పీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ హైదర్‌వల్లి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి మండల శాఖ అధికారులు, ప్రజా ప్రతినిధులు, గ్రామస్థాయి అధికారులు, సచివాలయంలోని అన్ని శాఖల కార్యదర్శులు, వలంటీర్లు హాజరుకావాలని వివరించారు.

తరగతులు నిర్వహిస్తే కఠిన చర్యలు

రాయచోటిటౌన్ : దసరా సెలవులలో తరగతులు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని అన్నమయ్య జిల్లా విద్యాశాఖాధికారి శ్రీరాం పురుషోత్తం మంగళవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. ఈ నెల 14 నుంచి 24వ తేది వరకు రాష్ట్ర ప్రభుత్వం సెలవులు ప్రకటించిందని పేర్కొన్నారు. కొన్ని ప్రైవేట్ పాఠశాలలకు చెందిన ప్రధానోపాధ్యాయులు ప్రైవేట్ తరగతులని, స్పెషల్ క్లాసులు అని, కోచింగ్‌లని ఇలా రకరకాలుగా ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా పాఠశాలలు నిర్వహిస్తున్నారనే సమాచారం తమ దృష్టికి వచ్చిందని తెలిపారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా తరగతులు నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

20న మైసూర్ స్పెషల్ సర్వీసు

మదనపల్లె సిటీ : దసరా సెలవులను పురస్కరించుకుని ఈనెల 20న కూర్గ్–మైసూర్ విహారయాత్ర స్పెషల్ సర్వీసు నడపనున్నట్లు ఆర్టీసీ–2 డిపో మేనేజర్ ఆర్‌సీ నిరంజన్ తెలిపారు. 20న రాత్రి 8గంటలకు బయలుదేరి 21న ఉదయం కూర్గ్ చేరుకుని అక్కడి అన్ని ప్రదేశాలు చూసుకుని మరుసటి రోజు 22న మైసూర్‌కు బయలుదేరుతుందన్నారు. అక్కడ బృందావన గార్డెన్స్, సచ్చిదానంద ఆశ్రమం, జూ, మ్యూజియం, చాముండి హిల్స్, ప్యాలెస్ చూసుకుని 23న ఉదయం మదనపల్లెకు చేరుకుంటుందన్నారు. చార్జీ రూ.2000 చెల్లించాలన్నారు. పూర్తి వివరాలకు 9959225677, 9160186645ను సంప్రదించాలని కోరారు.

ఎర్త్ సైన్స్ కోర్సులో అడ్మిషన్లు

వైవీయూ : యోగి వేమన విశ్వవిద్యాలయం పోస్టు గ్రాడ్యుయేషన్ కళాశాలలో ఎంఎస్సీ ఎర్త్ సైన్స్ విభాగంలో ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ అప్లైడ్ జియాలజీ కోర్సులో ప్రవేశాలు కల్పిస్తున్నట్లు ప్రవేశాల సంచాలకులు ఆచార్య కంకణాల గంగయ్య తెలిపారు. ఇంటర్మీడియట్ ఎంపీసీ, బైపీసీలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు అర్హులన్నారు. ఆసక్తి గల విద్యార్థులు ఈ నెల 20వ తేదీలోగా అర్హత పత్రాలతో నేరుగా వైవీయూ ప్రవేశాల సంచాలకుల కార్యాలయంలో సంప్రదించాలని కోరారు. వివరాలకు 89855 97928 నెంబర్‌లో సంప్రదించాలని కోరారు.

పదోన్నతులకు గ్రీన్ సిగ్నల్

వైవీయూ : యోగి వేమన విశ్వవిద్యాలయంలో అధ్యాపకుల పదోన్నతుల ప్రక్రియకు గ్రీన్ సిగ్నల్ లభించింది. కెరీర్ అడ్వాన్స్‌మెంట్ స్కీం (సీఏఎస్)లో భాగంగా పదోన్నతులు నిర్వహించేందుకు రిజిస్ట్రార్ ఆచార్య వై.పి. వెంకట సుబ్బయ్య మంగళవారం నోటిఫికేషన్ జారీచేశారు. విశ్వ విద్యాలయంలో ఆరుగురు అసోసియేట్ ప్రొఫెసర్లకు ప్రొఫెసర్లుగా, ఒక అసిస్టెంట్ ప్రొఫెసర్‌కు అసోసియేట్ ప్రొఫెసర్‌గా పదోన్నతి కల్పించనున్నారు. ఆసక్తి, అర్హత కలిగిన అధ్యాపకులు తదుపరి గ్రేడ్/పదోన్నతి పొందేందుకు అర్హులు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.వైవీయూ.ఈడీయూ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందని తెలిపారు. అనంతరం ధ్రువీకరణ పత్రాలను నవంబర్ 30వ తేదీలోపు విశ్వ విద్యాలయం రిజిస్ట్రార్ కార్యాలయంలో అందజేయాల్సి ఉంటుందని నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు.

నీకోసమే.. చదువు!

మీ చదువు మధ్యలోనే ఆగిపోయిందా..
మళ్లీ చదవాలన్న ఆశ ఉందా..
పదో తరగతి మార్కులు కళ్లారా
చూసుకోవాలని కలలు గన్నారా..
ఇంటర్ పూర్తి చేసింటే ప్రమోషన్
వచ్చిందేదని బాధపడుతున్నారా..
మీలాంటి వారి కోసమే 'ఓపెన్ స్కూల్'
తలుపులు తెరిచింది. మీ ఆశల్ని..
ఆశయాల్ని నెరవేర్చుకునే సువర్ణావకాశం
మీ ముంగిటకు వచ్చింది. చదివేయండిక.



మదనపల్లె జెడ్పీ ఉన్నత పాఠశాలలోని ఓపెన్‌స్కూల్ కేంద్రం

- సువర్ణావకాశాల 'ఓపెన్ స్కూల్'
- ఓపెన్ స్కూల్‌లో టెన్త్, ఇంటర్ ప్రవేశాలు
- ప్రారంభమైన తరగతులు
- నెలాఖరు వరకు ప్రవేశాలకు అవకాశం

మదనపల్లె సిటీ : వివిధ కారణాల వల్ల చదువు మానేసిన వారు పదో తరగతి, ఇంటర్ పూర్తి చేసేందుకు ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం (ఏపీ ఓపెన్ స్కూల్) ద్వారా ప్రభుత్వం సువర్ణావకాశం కల్పిస్తోంది. ఈ సర్టిఫికెట్లకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల గుర్తింపు ఉంది. వీరు ఎలాంటి ఉద్యోగానికైనా అర్హులే. చదువుపై ఆసక్తి ఉన్న పలువురు ఓపెన్ స్కూల్ ద్వారా పది, ఇంటర్ పూర్తి చేసి ఉన్నత స్థానాల్లో స్థిరపడ్డారు. అభ్యాసకులకు విద్యను మరింత చేరువ చేసేలా ప్రభుత్వం ఓపెన్ స్కూల్ తరగతులు నిర్వహిస్తోంది. నెలాఖరు వరకు వీటి దరఖాస్తు చేసుకోవచ్చు. ప్రవేశాలు పొందిన వారికి తరగతులు కూడా నిర్వహిస్తున్నారు.

టెన్త్‌కు 35.. ఇంటర్‌కు 31 కేంద్రాలు

జిల్లాలో టెన్త్‌కు 35, ఇంటర్‌కు 31 అధ్యయనా కేంద్రాలు ఉన్నాయి. పదో తరగతిలో 100 మందికి, ఇంటర్‌లో నాన్ సైన్సులో 40, సైన్స్‌లో100 మందికి అవకాశం ఉంది. అడ్మిషన్ పొందిన వెంటనే స్టడీ మెటీరియల్ అందిస్తారు. ప్రతి ఆదివారంతో పాటు సెలవు దినాల్లో ఆయా అధ్యయనా కేంద్రాలలో తరగతులు నిర్వహిస్తారు. పదో తరగతితో పాటు ఇంటర్‌లో ఆర్ట్స్ గ్రూపులైన హెచ్‌ఈసీ, సీఈసీ, సైన్సు గ్రూపులైన ఎంపీసీ, బైపీసీ, ఎంబైపీసీ, ఎంఈసీలో ప్రవేశాలు పొందవచ్చు. ఈ సర్టిఫికెట్లు ఉన్నత చదువులకు, ఉద్యోగాలకు, పదోన్నతులకు ఉపయోగపడుతున్నాయి. అభ్యర్థులు పదో తరగతి మార్కుల జాబితా లేదా జనన ధ్రువీకరణ పత్రం, టీసీ, ఆధార్‌కార్డు, కులధ్రువీకరణ పత్రం, బ్యాంకు పాస్‌బుక్, ఫొటో, సంతకంతో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది.

దరఖాస్తు గడువు పెంపు



చదువుకోవాలనుకునే వారికి ఓపెన్‌స్కూల్ మంచి అవకాశం. ఇప్పటికే పలువురు దరఖాస్తు చేసుకోగా, మరింత మందికి అవకాశామిచ్చేలా ప్రభుత్వం గడువు పెంచింది. రూ.200 ఫైన్‌తో ఈనెలాఖరు వరకు అవకాశం ఉంది. ఈ సర్టిఫికెట్లు ప్రభుత్వం గుర్తింపు ఉంది. ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలి.

-సుబ్బారెడ్డి, ఓపన్ స్కూల్ జిల్లా కో-ఆర్డినేటర్

చదువు మానేసిన వారికి సువర్ణావకాశం



వివిధ కారణాలతో మధ్యలోనే చదువు మానేసిన వారికి ఓపెన్ స్కూల్ సువర్ణావకాశం. ఉద్యోగాలు, ఇతర పనులు చేసుకుంటూ కూడా ఓపెన్‌స్కూల్‌లో ప్రవేశాలు పొందవచ్చు. ఆదివారం, సెలవు దినాలలో సబ్జెక్టు టీచర్లచే కాంట్రాక్టు తరగతులు నిర్వహిస్తున్నాం. చదువుకోవాలనే వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

-పి.మహమ్మద్‌ఖాన్,ఓపెన్‌స్కూల్ ఇన్‌చార్జి, జెడ్పీహెచ్ఎస్,మదనపల్లె

ఉపాధికి 'చింత' తీరినట్లే!

- చింతపండు ప్రాసెసింగ్ యూనిట్‌తో 30 వేల మందికి ఉపాధి
- రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిదున్‌రెడ్డి



చింతపండు ప్రాసెసింగ్ యూనిట్‌ను ప్రారంభిస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే , కలెక్టర్

కురబలకోట : కురబలకోట చెన్నామర్రి మిట్ట వద్ద ఏర్పాటైన చింతపండు ప్రాసెసింగ్ యూనిట్ రాష్ట్రానికి వరమని దీని ద్వారా ప్రత్యక్షంగా పరోక్షంగా 30 వేల మందికి ఉపాధి అవకాశాలు ఏర్పడతాయని లోక్ సభ ప్యానల్ స్పీకర్, రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఆయన ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ రెడ్డితో కలసి రూ. 5 కోట్లతో ఏర్పాటు చేసిన ఈ యూనిట్‌ను ప్రారంభించి ట్రయల్ రన్ నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ చిత్తూ రు, అన్నమయ్య జిల్లాల్లోని వివిధ మండలాల్లో పది వేల కుటుంబాలకు లబ్ధి చేకూరుతుందన్నారు. ఇక్కడి ఉత్పత్తులకు తగిన మార్కెటింగ్ కల్పించి దేశ విదేశాలకు సరఫరా అయ్యేలా చూస్తామన్నారు. దీన్ని కూడా పరిశ్రమగా ప్రాధాన్యతను ఇచ్చి అభివృద్ధి చేస్తామన్నారు. తంబళ్లపల్లె నియోజక వర్గానికి వాటర్ గ్రిడ్ ద్వారా ఇంటింటికి తాగునీటి సరఫరా చేస్తామన్నారు. అదే విధంగా ఈ ప్రాంతానికి అనువైన పరిశ్రమలు తీసుకు రావడం తమ ధ్యేయమన్నారు. సీఎం జగన్ కూడా ఇందుకు సానుకూలంగా ఉన్నారన్నారు. ముదివేడు రిజర్వాయర్ పై ఎన్జీటీ కేసు కూ డా త్వరలో అనుకూలంగా రానుందన్నారు. పనులు పూర్తి చేసి ఈప్రాంతాన్ని సస్యశ్యామలం చేస్తామని భరోసా ఇచ్చారు. బాధిత రైతులకు కూడా త్వరలో భూ పరిహారం బ్యాంకు ఖాతాలకు జమ అయ్యేలా చూస్తామన్నారు. రిజర్వాయర్‌పై టీడీపీ వాళ్లు వేసిన కేసు వల్ల రైతుల పరిహారం చెల్లింపుకు ఇబ్బందికరంగా మారుతోందన్నారు. అంతకు ముందు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ రెడ్డి మాట్లాడుతూ నియోజక వర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తున్నామన్నారు. కలెక్టర్ గిరీషా పీఎస్ మాట్లాడుతూ చింత పండు క్లస్టర్ ద్వారా ఏడాదికి 40 వేల మెట్రిక్ టన్నుల చింతపండు ఉత్పత్తి చేయాలన్నది లక్ష్యమన్నారు. అనంతరం కంటేవారిపల్లె వద్ద జగనన్న కాలనీని, అంతకు ముందు చింతమాకులపల్లెలో ఆర్బీకేను ఎంపీ పెద్దిరెడ్డి మిదున్ రెడ్డి, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి ప్రారంభించారు. ఇక్బాల్, పీడీ తులసీ, బైసాని జ్యోతి, చంద్రశేఖర్‌రెడ్డి, బి. దస్తగిరి, కృష్ణారెడ్డి, డిఆర్. ఉమాపతిరెడ్డి, మండల కన్వీనర్ కోళ్ల వాసుదేవరెడ్డి, ఎస్వీ రమణారెడ్డి, ఆర్కే కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మాటపై నిలబడే నాయకుడు జగన్

బి.కొత్తకోట: సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాటపై నిలబడే నాయకుడని రాజంపేట ఎంపీ పీవీ మిథున్‌రెడ్డి అన్నారు. బి.కొత్తకోటలో మంగళవారం నిర్వహించిన ఓ సభలో ఆయన మాట్లాడుతూ గత ఎన్నికల సమయంలో మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలతో పాటు ఇతర అనేక హామీలను సీఎం నెరవేర్చారని అన్నారు. గత టీడీపీ పాలన, ప్రస్తుత జగన్‌మోహన్‌రెడ్డి పాలన బేరీజు వేసుకుని ఎవరి పాలనలో మంచి జరిగిందో గుర్తించాలన్నారు.

ఎమ్మెల్యే దాతృత్వం



మహిళలకు కుట్టు మిషన్లు అందిస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే

బి.కొత్తకోట : చిరు వ్యాపారులు, మైనార్టీ మహిళలపై ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి దాతృత్వం చాటుకున్నారు. టైలరింగ్ వృత్తిపై ఆధారపడిన పేద మైనార్టీ మహిళలకు 150 కుట్టు మిషన్లు ఉచితంగా అందించాలని నిర్ణయించారు. ఈ కుట్టు మిషన్లకు లబ్ధిదారులను ఎంపిక చేశారు. అలాగే తోపుడుబండ్లపై చిరువ్యాపారాలు చేసుకునే వారికి 90 సోలార్ లైట్లను తెప్పించారు. మంగళవారం వీటిని ఎంపీ మిథున్‌రెడ్డి చేతులమీదుగా ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి పంపిణీ చేయించారు. బి.కొత్తకోటలో మైనార్టీ మహిళలు అధికంగా ఉన్నందున మరో 150 కుట్టు మిషన్లను పంపిణీ చేయిస్తామని చెప్పారు. చిరు వ్యాపారులకు సోలార్ లైట్లను అందించారు. అనంతరం ఎంపీ నిధులతో నగర పంచాయతీకి అందించిన మూడు ట్రాక్టర్లను ఎంపీ, ఎమ్మెల్యే ప్రారంభించారు.

పరిహార చెల్లింపులు వేగవంతం చేయండి

కలెక్టర్ గిరీషా.పీఎస్



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ గిరీషా, జేసీ ఫర్మాన్ అహ్మద్

మదనపల్లె : జిల్లాలోని ముదివేడు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్, ఎన్‌హెచ్–71 పరిహారం చెల్లింపులను వేగవంతంగా పూర్తిచేయాలని కలెక్టర్ గిరీషా సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం మదనపల్లె సబ్‌కలెక్టరేట్‌లో ముదివేడు రిజర్వాయర్, ఎన్‌హెచ్–71కు సంబంధించి భూసేకరణ, పరిహారం చెల్లింపులపై అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ గిరీషా మాట్లాడుతూ ముదివేడు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌కు సంబంధించి మొత్తంగా 1,074.63 ఎకరాలు అవసరం కాగా, వందశాతం భూసేకరణ పూర్తయిందన్నారు. వీటిలో మొత్తం పట్టా భూములకు అవార్డ్స్ ప్రక్రియ పూర్తి చేశామన్నారు. ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీకి సంబంధించి పూర్తి నివేదికను తయారుచేసి కమిషనర్‌కు పంపేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఎన్‌హెచ్–71 మదనపల్లె నుంచి పీలేరు జాతీయరహదారి ఫోర్‌లేన్‌కు సంబంధించి భూసేకరణ పూర్తయిందని, ఇప్పటికే అవార్డ్స్ పాస్ చేసిన భూములకు, నిర్వాసితులకు పరిహారం చెల్లింపులు వందశాతం పూర్తి చేయాలన్నారు. ఈ సందర్భంగా అవార్డ్స్ పాస్ అయిన భూయజమానులకు ఎన్నిసార్లు సమాచారం అందించినా పరిహారం తీసుకువెళ్లడం లేదని తహసీల్దార్లు కలెక్టర్‌కు వివరించారు. జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, డిప్యూటీ కలెక్టర్ సందీప్, తహసీల్దార్ మహబూబ్‌చాంద్, ఎన్‌హెచ్ అధికారులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

వెండి కిరీటాలు వితరణ

లక్కిరెడ్డిపల్లి : మండల కేంద్రంలోని విశ్వభారతి స్కూల్ సమీపంలో వెలసిన ఆంజనేయస్వామి ఆలయంలో స్వామివారికి, సర్వమంగళా దేవి సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో సుబ్రమణ్యం స్వామివారికి లక్ష రూపాయలు విలువగల కిరీటాలు ఆలయ వ్యవస్థాపకులు ఓబులేశ్వరమ్మ, ఆలయ ధర్మకర్త మోహన్ రెడ్డి, భూదేవమ్మ ఆలయ ప్రధాన అర్చకులు శ్రీహరిస్వామిలకు అందజేశారు. ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

జగనన్న సురక్ష శిబిరాల తనిఖీ

కురబలకోట : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ పీఎస్ గిరీష సూచించారు. మంగళవారం ఆయన మండలంలోని కనసానివారిపల్లె సచివాలయం వద్ద జరిగిన జగనన్న సురక్ష శిబిరాన్ని తనిఖీ చేశారు. ఓపీలు, టెస్టులు, కంటి చికిత్సలు, మందుల పంపిణీ, ఆరోగ్యశ్రీ రెఫర్ కేసులు తదితర విషయాలను నిశితంగా అడిగి తెలుసుకున్నారు. రిజిస్టర్లను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ శిబిరాల్లో ఎలాంటి లోపాలు ఉండరాదన్నారు. అలసత్వం పనికి రాదన్నారు. వైద్యాధికారులు కె. శ్రీధర్, క్రిస్టల్‌కు సలహాలు, సూచనలు ఇచ్చారు.

ఈశిబిరాలను ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. స్పెషలాఫీసర్ చంద్రానాయక్, బైసాని జ్యోతి, చంద్రశేఖర్ రెడ్డి, సర్పంచ్ ఆర్కే కృష్ణారెడ్డి, ఎంపీటీసీ ముదివేటి ఆనందరెడ్డి, అమరనాధరెడ్డి, చంద్రకళ,వన్ను కొండారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గర్భిణుల మోముల్లో చిరునవ్వు కోసమే సీమంతం

జెడ్పీ ఛైర్మన్ ఆకేపాటి అమర్‌నాథ్ రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ ఆకేపాటి

రాజంపేట టౌన్ : గర్భిణీలకు సీమంతం కార్యక్రమం ఓ తీపి జ్ఞాపకమని.. పేద, మధ్యతరగతి గర్భిణుల మోముల్లో చిరునవ్వు చూడడం కోసం ఆకేపాటి ఫౌండేషన్ ట్రస్ట్ ద్వారా ఈనెల 20న ఆకేపాటి ఎస్టేట్‌లో సీమంతం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు జెడ్పీ ఛైర్మన్ ఆకేపాటి అమర్‌నాథరెడ్డి తెలిపారు. స్థానిక ఆర్‌అండ్‌బీ బంగ్లాలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాజంపేట నియోజకవర్గంలోని ఆరు మండలాల, రైల్వేకోడూరు నియోజకవర్గంలోని పెనగలూరు, పుల్లంపేట మండలాలకు చెందిన వందలాది మంది గర్భిణీలకు తాను ఓ అన్ననై సీమంతం కార్యక్రమం చేపడుతున్నందుకు ఎంతో సంతోషంగా ఉందని తెలిపారు. 19 సంవత్సరాలుగా ఈకార్యక్రమాన్ని చేపట్టే అవకాశం రావడం తన పూర్వజన్మ సుకృతమన్నారు. ఇది తనకు భగవంతుడు కల్పించిన అవకాశంగా భావిస్తున్నట్లు తెలిపారు. సీమంతం కార్యక్రమం సందర్భంగా అంకుర కార్పొరేట్ హాస్పిటల్ యాజమాన్యం గర్భిణీలకు ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించేందుకు ముందుకు రావడం శుభపరిణామమన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ సనిశెట్టి నవీన్‌కుమార్, సౌమ్యనాథ స్వామి ఆలయ మాజీ ఛైర్మన్ సౌమిత్రి, వైఎస్సార్ సీపీ వివిధ విభాగాల కన్వీనర్లు బొల్లినేని రామ్మోహన్‌నాయుడు, దాసరి పెంచలయ్య, దండు గోపి, జీవీ.సుబ్బరాజు తదితరులు పాల్గొన్నారు.

అన్నమయ్య జిల్లా ఆర్టీఓగా భరత్ చవాన్



రాయచోటి : అన్నమయ్య జిల్లా ఆర్టీఓగా ఎల్.భరత్ చవాన్‌ను ప్రభుత్వం నియమించింది. మంగళవారం రాయచోటిని ఆర్టీఓ కార్యాలయంలో ఆయన బాధ్యతలు చేపట్టారు. అనంతపురం జిల్లాకు చెందిన ఈయన 2022 గ్రూప్–1 ద్వారా ఎంపికయ్యారు.

అన్నపూర్ణ రూపం.. భక్తజన పరవశం

శరన్నవరాత్రి ఉత్సవాలు మంగళవారం మూడో రోజున వైభవోపేతంగా జరిగాయి. ప్రొద్దుటూరు కన్యకా పరమేశ్వరీ ఆలయం లో మంగళవారం ఆధ్యాత్మిక శోభ ఉట్టిపడుతోంది. సకల జీవులకు అన్నం పరబ్రహ్మస్వరూపం.. అన్నం లేనిదే జీవుని మనుగడ లేదు. మాతా.. అన్నపూర్ణేశ్వరీ అంటూ వేద పండితులు వాసవీ కన్యకా పరమేశ్వరీ ఆలయంలో అన్నపూర్ణేశ్వరిగా అమ్మవారిని అలంకరించారు. వివిధ రకాల ఆహార పదార్థాలను అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. పెద్ద ఎత్తున భక్తులు ఆలయాలకు పోటెత్తడంతో ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేశారు. సాయంత్రం నుంచి ఆలయాల సమీప వీధులు జనసంద్రాలయ్యాయి. – ప్రొద్దుటూరు కల్చరల్





ప్రొద్దుటూరు అమ్మవారిశాలలో అమ్మవారికి సమర్పించిన వివిధ రకాల పిండి వంటలు (ఇన్‌సెట్) అన్నపూర్ణాదేవి, భారీ ఎత్తున క్యూలైన్‌లో బారులు తీరిన భక్తజనం

క్లుప్తంగా

చోరీ కేసులో రెండేళ్లు జైలుశిక్ష

రాజంపేట : ఈ యేడాది ఏప్రిల్ 29న రాజంపేట పట్టణంలోని మోహర్‌బాబా నగర్‌లో బొజ్జిరెడి అశోక్‌రెడ్డి ఇంటిలో చోరీ జరిగింది. ఈ కేసులో ఎస్వీనగర్‌కు చెందిన బాలిపోగు ఇజ్రాయిల్‌కు రెండేళ్ల జైలుశిక్ష విధిస్తూ రాజంపేట మొదటి తరగతి కోర్టు ఇన్‌చార్జి జడ్జి లత తీర్పు ఇచ్చారు. ఈ విషయాన్ని పట్టణ సీఐ నరసింహారావు మంగళవారం విలేకరులకు తెలిపారు. చోరీకి సంబంధించి మార్చి 15న ముద్దాయిని అరెస్టు చేసి, 88 గ్రాముల బంగారు లాభరణాలను రికవరీ చేశామన్నారు. ముద్దాయిని జైలుకు తరలించి, చార్జిషీటు దాఖలు చేశామన్నారు. కేసులో సాక్షులను విచారించి ముద్దాయిపై నేరారోపణ రుజువు కావడంతో జడ్జి రెండేళ్ల జైలు శిక్ష విధించారన్నారు.

కానిస్టేబుళ్లకు రివార్డులు

ప్రొద్దుటూరు క్రైం : ఐదేళ్ల నుంచి కోర్టు వాయిదాలకు హాజరు కాకుండా తప్పించుకుని తిరుగుతున్న వ్యక్తిని అదుపులోకి తీసుకున్న కానిస్టేబుళ్లకు రూరల్ సీఐ రమణారెడ్డి రివార్డు అందజేశారు. మండల పరిధిలోని మీనాపురం గ్రామానికి చెందిన గిడ్డంగి రసూల్ ఒక కేసుకు సంబంధించి ఐదేళ్ల నుంచి కోర్టు వాయిదాలకు హాజరు కాకుండా తప్పించుకొని తిరుగుతున్నాడు. ఈ క్రమంలో నెల్లూరులో ఉన్న రసూల్‌ను మంగళవారం రూరల్ కానిస్టేబుళ్లు శ్రీనివాస్, మధుసూదన్‌రెడ్డిలు అదుపులోకి తీసుకొని ప్రొద్దుటూరు కోర్టులో హాజరు పరిచారు. లాంగ్ పెండింగ్ నాన్ బెయిలబుల్ వారెంట్‌ను ఎగ్జిక్యూట్ చేసినందుకు సీఐ రమణారెడ్డి ఇరువురు కానిస్టేబుళ్లకు నగదు రివార్డును అందజేసి అభినందించారు.

అత్తవారింటి ముందు మహిళ బైఠాయింపు

ప్రొద్దుటూరు క్రైం : తనకు భర్త, కుమారుడు కావాలంటూ ఒక మహిళ అత్తవారింటి ముందు బైఠాయించిన సంఘటన ప్రొద్దుటూరు మండలం బొజ్జవారిపల్లెలో మంగళవారం జరిగింది. బాధితులు తెలిపిన మేరకు.. మైదుకూరుకు చెందిన అస్మాసుల్తానాకు నాలుగున్నర ఏళ్ల క్రితం బొజ్జవారిపల్లెకు చెందిన కిరణ్‌బాషాతో వివాహమైంది. భార్యాభర్తలిద్దరూ సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు. పెళ్లైన తర్వాత ఆమె భర్తతో పాటు బ్రునై దేశానికి వెళ్లి 2019 డిసెంబర్‌లో తిరిగి వచ్చి బొజ్జవారిపల్లెలో ఉంటున్నారు. కరోనా కారణంగా భర్త వర్క్‌ఫ్రం హోం చేస్తూ ఇంటి వద్దనే ఉంటున్నాడు. వారికి మూడేళ్ల కుమారుడు ఉన్నారు. ఈ క్రమంలో కుటుంబ సభ్యులతో మనస్పర్థలు రావడంతో కొన్ని నెలల నుంచి ఆమె మైదుకూరులోని అమ్మగారింట్లో ఉంటోంది. కుమారుడు మాత్రం తండ్రి వద్దనే ఉంటున్నాడు. తనను కాపురానికి తీసుకెళ్లాలని మంగళవారం అత్తవారింటి ముందు బైఠాయించింది. విషయం తెలిసిన ప్రొద్దుటూరు రూరల్ పోలీసులు ఇరువురితో మాట్లాడారు. వారం తర్వాత ప్రొద్దుటూరులో కాపురం పెడ తామని కిరణ్‌బాషా కుటుంబ సభ్యులు తెలిపారు.

స్వాతంత్య్ర యోధులను స్మరించుకోవాలి

ప్రొద్దుటూరు : ప్రతి ఒక్కరూ స్వాతంత్య్ర సమర యోధులను స్మరించుకోవాలని రాజంపేట కోర్టు అడిషనల్ జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ పసుపులేటి శంకర్ పేర్కొన్నారు. మండలంలోని వాగ్దేవి ఇంజనీరింగ్ కాలేజీలో నెహ్రూ యువ కేంద్రం, వికసిత ఫౌండేషన్ ఆధ్వర్యంలో నా దేశం నా మట్టి కార్యక్రమం నిర్వహించారు. 100 అడుగుల జాతీయ జెండాను విద్యార్థులు నరసింహాపురం గ్రామం వరకు ర్యాలీగా తీసుకెళ్లి అక్కడ కలశాలలో మట్టిని సేకరించారు.

ముచ్చటగా మూడోసారి కృష్ణమ్మ రాక!

- హంద్రీనీవాపై ఈనాడు కట్టు కథలు
- 2021లో భారీ వర్షాలకు పడిన గండ్లు రూ.60లక్షలతో పూడ్చివేత
- టీడీపీ ప్రభుత్వంలో ఒకసారిస్తే.. రెండుసార్లు నీళ్లిచ్చారట
- అది గండి కాదు.. తూము నుంచి పొంగిన నీళ్లు
- ఎత్తిపోతల నిర్వహణ బాధ్యత కాంట్రాక్టు సంస్థలదే


నిధులివ్వమంటే నీళ్లొదిలారు!

హంద్రీనీవాపై ఈనాడు కథనం


పుంగనూరు ఉపకాలువపై గండ్లు పూడ్చివేసి సిద్ధంచేసిన కాలువ

ఫ్యాక్ట్ చెక్

బి.కొత్తకోట : ఏపీఆర్ హంద్రీనీవా ప్రాజెక్టు కాలువ నిర్వహణ, గండ్లు పూడ్చివేతపైనా, ఇప్పుడు పుంగనూరు ఉప కాలువలో ప్రవహిస్తున్న కృష్ణా జలాలతో కాలువకు గండిపడిందని ఈనాడు కట్టు కథను అల్లింది. అవాస్తవాలతో ప్రభుత్వానికి అపవాదు తెచ్చేలా కథను వండివార్చింది. గత టీడీపీ ప్రభుత్వంలో మొక్కుబడిగా ఒకసారి మాత్రమే నీటి విడుదల చేయగా రెండుసార్లు నీటిని విడుదల చేసిందని తప్పుడు కథనం రాసింది. ప్రస్తుత ప్రభుత్వంలో మూడోసారి నీటిని విడుదల చేసినా ఒకసారి విడుదల చేసినట్టు రాసి టీడీపీ ఘనకార్యం చేసినట్టు రాసుకొచ్చింది. వాస్తవ వివరాల్లోకి వెళితే...

టీడీపీ హయాంలో ఒకసారే

2019 ఎన్నికల్లో ప్రయోజనం పొందడం కోసం టీడీపీ ప్రభుత్వం 2019 జనవరి 21న జిల్లాలోకి హంద్రీనీవా పుంగనూరు ఉపకాలువ ద్వారా కృష్ణా జలాలను తరలించింది. 2019 జనవరి 21న ప్రారంభించి ఏప్రిల్ 11 వరకు తరలించి ఆర్భాటం చేసినా అందించిన నీళ్లు కేవలం 775 ఎంసీఎఫ్‌టీలు. కాలువలో నీళ్లు పారించారే కాని ఒక్క చెరువుకు నీళ్లవ్వలేదు. తరలించిన నీళ్లన్నీ కాలువలో ప్రవాహానికే సరిపోయాయి. దీన్ని ఘనతగా చెప్పుకునేందుకు పెద్దతిప్పసముద్రంలో పెద్ద బహిరంగ సభను నిర్వహించారు. అయితే రెండుసార్లు టీడీపీ హయాంలో నీటిని తరలించినట్టు రాశారు.

జగన్ పాలనలో మూడోసారి

ప్రస్తుత ప్రభుత్వంలో జిల్లాకు 3.8618 టీఎంసీల కృష్ణా జలాలు తరలించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిది. సత్యసాయిజిల్లా కదిరి సమీపంలోని చెర్లోపల్లె జలాశయం నుంచి పుంగనూరు ఉపకాలువ ద్వారా 2019 నవంబర్ 22 నుంచి మార్చి వరకు 1.34 టీఎంసీలు, 2020 నవంబర్ 12 నుంచి 2021 మే15 వరకు 2.5218 టీఎంసీల నీళ్లను ప్రస్తుత అన్నమయ్య, చిత్తూరు జిల్లాలకు చెందిన 91 చెరువులకు నీటిని అందించారు. కుప్పం ఉపకాలువ సాగే వి.కోట మండలం వరకు తరలించారు. మదనపల్లె, పుంగనూరు పట్టణ ప్రజలకు తాగునీటిని అందించే చిప్పిలి, గుంటివారిపల్లె, పుంగమ్మ సమ్మర్‌స్టోరేజీ ట్యాంకులను కృష్ణా జలాలతో నింపారు. పలమనేరు నియోజకవర్గం శంకర్రాయలపేట చెరువుకు నీటిని తరలించారు. ఈ స్థాయిలో కృష్ణా జలాలు తరలించినా ఎక్కడా ప్రచారం చేసుకోలేదు. 2021 ఖరీఫ్‌లో అధిక వర్షాలతో నీటి అవసరం లేకపోవడంతో తరలించలేదు. ప్రస్తుతం మూడోసారి ఉమ్మడి చిత్తూరు జిల్లాకు కృష్ణాజలాలు అందించేందుకు నిర్ణయించగా చెర్లోపల్లె రిజర్వాయర్ నుంచి నీటిని విడుదల చేయగా శనివారం జిల్లాలోకి జలాలు ప్రవేశించాయి.

ఎత్తిపోతల నిర్వహణ కాంట్రాక్టర్లదే

హంద్రీనీవా రెండోదశ ప్రాజెక్టు మదనపల్లె సర్కిల్ పరిధిలో 38 ఎత్తిపోతల పథకాలు ఉన్నాయి. కాలువలోకి నీటిని విడుదల చేసినప్పుడు నీటిని ఎత్తిపోసేలా పథకాలను సిద్ధం చేసుకోవడం, నిర్వహణ బాధ్యతలు కాంట్రాక్టు సంస్థకే ఉంటాయి. ఈ నిర్వహణకు ప్రభుత్వం పైసా విడుదల చేయలేదని రాశారు. వీటి పనితీరును అధికారులు పరిశీలించి సూచనలు చేస్తుంటారు. నిర్వహణ కోసం ప్రభుత్వం ప్రత్యేకంగా నిధులు ఇవ్వడం అంటూ ఉండదు. వీటికయ్యే విద్యుత్ బిల్లులను ప్రభుత్వం చెల్లిస్తుంది. ఈ విద్యుత్ బిల్లులకు సంబంధించి ప్రభుత్వం రూ.170 కోట్లు చెల్లించింది. ఏ ఒక్క పథకం నిర్వహణలోనూ అంతరాయం ఇప్పటి వరకు కలగలేదు. వీటి నిర్వహణ బాధ్యత కాంట్రాక్టర్లదేనని ఎస్ఈ రాజగోపాల్ స్పష్టం చేశారు.

నీళ్లు పొంగితే గండి అంట

పెద్దతిప్పసముద్రం మండలం మద్దయ్యగారిపల్లె వద్ద పుంగనూరు ఉపకాలువలో కృష్ణా జలాలు ప్రవహిస్తున్నాయి. ఈ ప్రదేశంలో చెరువులు, వంకలకు నీటిని మళ్లించడం కోసం కాలువ 1.75 నుంచి 2 మీటర్ల మధ్యలో పైపుతో తూము ఏర్పాటు చేశారు. కాలువలో నీళ్లు నిండుగా ప్రవహించి ఈ తూముపైకి వెళ్లడంతో తూముకు అడ్డంగా పెట్టిన ఇసుక బస్తాలు పగిలి నీళ్లు బయటకు వెళ్లాయి. పది మీటర్ల దూరం తర్వాత వంకలోకి నీళ్లు వెళ్లాయి. రైతుల పంటలకు, పొలాలకు ఎలాంటి నష్టం వాటిల్లలేదు. తమకు నష్టం జరిగిందని ఒక్క రైతు నుంచి ఫిర్యాదు లేదు. లేనిది రాసి మభ్యపెట్టారు. సోమవారం దీనిపై ప్రాజెక్టు ఇంజినీర్లు వెళ్లి పరిశీలించగా అది గండి కాదని నిర్ధారించారు. తూము నుంచి నీళ్లు బయటకు వెళ్లినట్టు, ఒక్క రైతుకూ నష్టం కలగలేదని తేల్చారు.

గండ్లు పూడ్చకనే నీళ్లు పారిస్తారా!

2021లో కురిసిన భారీ వర్షాలకు పెద్దతిప్పసముద్రం –బి.కొత్తకోట మండలాల్లో పుంగనూరు ఉపకాలువకు 11 చోట్ల గండ్లు పడ్డాయి. భారీ వర్షాలకు నీళ్లు కాలువపై ప్రవహించడంతో ఈ పరిస్థితి ఏర్పడింది. ఈ గండ్లను పూడ్చేందుకు రూ.60 లక్షలతో టెండర్లు నిర్వహించగా హైదరాబాద్‌కు చెందిన కాంట్రాక్టు సంస్థ పనులు దక్కించుకొంది. ఈ పనులు పూర్తవడంతోనే చెర్లోపల్లె రిజర్వాయర్ నుంచి కృష్ణా జలాలను జిల్లాకు విడుదల చేశారు. ఒకవేళ ఎక్కడన్నా గండి ఉంటే నీళ్లు ఎలా ముందుకు సాగుతాయి అన్న అనుమానం కలగకుండానే రాయడమే విచిత్రం. ఒకవేళ కాలువకు గండి పడివుంటే కాలువ తెగిపోవాలి కదా మరి అలాంటిది జరగలేదే అని పలువురు చర్చించుకుంటున్నారు.


మద్దయ్యగారిపల్లె వద్ద కాలువపై తూము


పెద్దతిప్పసముద్రం మండలంలోకి చేరిన కృష్ణా జలాలు

బర్రెలను ఢీకొని స్కూటరిస్టుకు గాయాలు

రామాపురం : మండల పరిధి చిట్లూరు పంచాయితీ పాలన్నగారిపల్లె సమీపంలోని కర్నూలు – చిత్తూరు జాతీయ రహదారిపై మంగళవారం బర్రెలను స్కూటర్ ఢీకొనంతో స్కూటరిస్టు భువనేశ్వర్, కృష్ణులకు తీవ్రగాయాలైన సంఘటన చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు మండలంలోని బండపల్లె పంచాయితీ పొత్తుకూరువాండ్లపల్లెకు చెందిన భువనేశ్వర్, సుద్దమళ్ల పంచాయితీ ఎర్రంరెడ్డిగారిపల్లెకు చెందిన కృష్ణలు రామాపురం నుండి పొత్తుకూరుపల్లెకు స్కూటీలో వెళ్తుండగా మార్గమధ్యలోని పాలన్నగారిపల్లె రాగానే రోడ్డుపై వెళ్తున్న బర్రెలను ఢీ కొనడంతో గాయాలైనట్లు ఎస్ఐ కొండారెడ్డి తెలిపారు. సమాచారం అందిన వెంటనే సంఘటనస్థలనాకి వెళ్లి క్షతగాత్రులను 108లో రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పాము కరిచి ఒకరు.. కుక్కకాటుతో మరొకరు అస్వస్థత

మదనపల్లె : పాము కరిచి ఒకరు, కుక్కకాటుతో మరొకరు తీవ్రఅస్వస్థత పాలై స్థానిక ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. గుర్రంకొండ మండలం రామాపురం పంచాయతీ దిగువబురుజుపల్లెకు చెందిన రాము కుమారుడు జె.వేణు(26) ఉదయం పొలాల వద్దకు బహిర్భూమికి వెళ్లగా పాముకాటుకు గురయ్యాడు. బాధితుడు తీవ్ర అస్వస్థతకు లోనుకాగా, గమనించిన కుటుంబ సభ్యులు 108 వాహనంలో మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. అదేవిధంగా ములకలచెరువు మండలం మద్దినాయునిపల్లెకు చెందిన కదిరప్ప కుమారుడు రామచంద్ర(55) మంగళవారం వీధిలో నడిచివస్తుండగా, కుక్కలు గొడవపడుతూ ఇతడిపై దాడిచేసి కరిచాయి. ఘటనలో రామచంద్ర తీవ్రంగా గాయపడగా, కుటుంబ సభ్యులు 108 వాహనంలో జిల్లా ఆస్పత్రికి తరలించారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

కడప వైఎస్ఆర్ సర్కిల్ : కడప ఎస్ఈబీ స్టేషన్ పరిధిలో అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను సీజ్ చేసినట్లు కడప ఎస్ఈబీ సీఐ విశ్వనాథరెడ్డి తెలిపారు. ప్రభుత్వం నిర్ణయించిన స్టాక్ పాయింట్ నుంచి కాకుండా ఇతర ప్రాంతం నుంచి అక్రమంగా ఇసుక తీసుకొని వస్తుండగా సీజ్ చేసి కేసు నమోదు చేశారు.

జిల్లా ఆస్పత్రిలో బాలింత మృతి

వైద్యుల నిర్లక్ష్యమంటూ గొడవకు దిగిన కుటుంబీకులు

మదనపల్లె : స్థానిక ప్రభుత్వ జిల్లా ఆస్పత్రి ప్రసూతి వార్డులో చికిత్స పొందుతూ బాలింత మృతి చెందిన సంఘటన సోమవారం రాత్రి జరిగింది. ములకలచెరువు మండలం బురకాయలకోట పంచాయతీ బోయమూలపల్లెకు చెందిన ఆనంద్ భార్య నాగవేణి(24) తొలికాన్పు కోసం ఈనెల 10న ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో చేరింది. కాన్పు కష్టం కావడంతో ఈనెల 11న సిజేరియన్ ఆపరేషన్ ద్వారా వైద్యులు చికిత్స అందించగా, మగబిడ్డను ప్రసవించింది. అప్పటి నుంచీ ప్రసూతివార్డులో ఆమె చికిత్స పొందుతోంది. సోమవారం రాత్రి 11గంటల సమయంలో ఆస్పత్రిలోని బెడ్‌పైనే ఒక్కసారిగా కుప్పకూలి అపస్మారకస్థితికి చేరుకుంది. విధుల్లో ఉన్న నర్సింగ్ సిబ్బంది వైద్యులకు సమాచారం అందించగా గైనిక్ వైద్యురాలు ఉమాదేవి వచ్చి ఆమెను పరీక్షించి మృతిచెందినట్లు నిర్ధారించారు. దీంతో నాగవేణి బంధువులు ఒక్కసారిగా ఆగ్రహానికి గురయ్యారు. రాత్రి భోజనం తిని పడుకున్న తమ బిడ్డ ఎలా మృతి చెందిందంటూ డాక్టర్లు, సిబ్బందిని నిలదీశారు. వైద్యసిబ్బంది నిర్లక్ష్యం కారణంగానే నాగవేణి మృతి చెందిందంటూ గొడవకు దిగారు. రాత్రివేళల్లో బాలింతలకు సరైన చికిత్స అందించడం లేదని ఆరోపించారు. ఆస్పత్రి సిబ్బందిపై కుటుంబీకులు గొడవకు దిగిన సమాచారాన్ని తెలుసుకున్న అవుట్ పోస్ట్ ఏఎస్ఐ గణపతి టూటౌన్ పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులతో కలిసి వార్డులోకి వెళ్లి సమస్యను పరిష్కరించే ప్రయత్నం చేశారు. ఆ సమయంలో అక్కడకు చేరుకున్న ఆర్ఎంఓ డాక్టర్ ప్రసాదరాజు మృతురాలి కుటుంబీకులతో మాట్లాడి వైద్యచికిత్స అందించడంలో సిబ్బంది నిర్లక్ష్యం ఉంటే చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. దీంతో తెల్లవారుజామున నాగవేణి మృతదేహాన్ని కుటుంబ సభ్యులు వారి స్వగ్రామానికి తీసుకెళ్లారు. తమ బిడ్డ మృతిపై సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోకుంటే ఆందోళనకు దిగుతామని మృతురాలి కుటుంబ సభ్యులు హెచ్చరించారు. ఆర్ఎంఓ ప్రసాద్‌రాజు బాలింత మృతిపై వివరణ ఇస్తూ.. నాగవేణి రెండురోజులుగా జ్వరంతో బాధపడుతోందని, రక్తకణాల సంఖ్య తగ్గిపోవడంతో గైనిక్ డాక్టర్ ఉమాదేవి, ఫిజీషియన్ మోహిని వైద్యసేవలు అందించారన్నారు. రక్తకణాల సంఖ్య తగ్గిన కారణంగా పలమనరీ ఎంబాలసీతో మృతి చెందినట్లు తెలిపారు.


ప్రసూతివార్డులో నాగవేణి మృతదేహం వద్ద రోదిస్తున్న ఆమె భర్త ఆనంద్

డ్వాక్రా మహిళల అభివృద్ధికి కృషి

కడప ఎడ్యుకేషన్ : రాష్ట్రవ్యాప్తంగా డ్వాక్రా మహిళల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందని ఏపీ పంచాయతీరాజ్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ ప్రభుత్వ సలహాదారు నాగార్జునరెడ్డి అన్నారు. మంగళవారం కడపలోని డీఆర్‌డీఏ కార్యాలయంలో ప్రాజెక్టు డైరెక్టర్ ఆనంద్‌నాయక్ ఆధ్వర్యంలో ఏరియా కో ఆర్డినేటర్లు, డీపీఎంసీలతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత రాష్ట్రంలోని డ్వాక్రా సంఘాలకు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చారన్నారు. గత ప్రభుత్వానికి, ఈ ప్రభుత్వానికి ఉన్న తేడాను గమనించాలన్నారు. డ్వాక్రా సంఘాలను మరింత బలోపేతం చేసేందుకు డ్వాక్రా సంఘాల ద్వారా సూపర్ మార్కెట్లను ఏర్పాటు చేయించి వారి ఆర్థిక రాబడికి తోడ్పాటును అందించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఏరియా కోఆర్డినేటర్లు, డీపీఎంసీ సిబ్బంది పాల్గొన్నారు.

ఆన్‌లైన్ గేమ్స్‌ను అరికట్టాలి

ఆన్‌లైన్ గేమ్స్‌ను అరికట్టి యువత ప్రాణాలను నిలపాలని ఎస్పీ సిద్దార్థ కౌశల్‌ను ఏపీ పంచాయతీరాజ్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ ప్రభుత్వ సలహాదారు నాగార్జునరెడ్డి కోరారు. జిల్లా ఎస్పీని మంగళవారం ఆయన మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం ఆయనకు వినతిపత్రాన్ని సమర్పించారు. యువత ఆన్‌లైన్ గేమ్స్‌కు బానిసలై లక్షలాది రూపాయలను పోగొట్టుకుంటున్నారన్నారు.

భద్రతకు అధిక ప్రాధాన్యత

గుంతకల్ సీనియర్ డివిజనల్ మేనేజర్ డాక్టర్ శ్రావణ్ కుమార్

నందలూరు (రాజంపేట) : రైల్వేలో భద్రతకు అధిక ప్రాధాన్యత కల్పించనున్నట్లు గుంతకల్ సీనియర్ డివిజనల్ మేనేజర్ డాక్టర్ శ్రావణ్ కుమార్ పేర్కొన్నారు. మంగళవారం ఆయన నందలూరు రైల్వే కేంద్రాన్ని పరిశీలించి రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైలు వెళ్తున్న సమయంలో టీఎంఆర్ (గార్డు)లోకో పైలెట్లు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో వివరించారు. సిగ్నల్స్ మరమ్మతులకు గురైన తరువాత సిబ్బంది తీసుకోవాల్సిన చర్యలను తెలిపారు. ఈ సమావేశంలో టీఐ రూల్స్ రామకృష్ణ నాయక్, టీఐ స్టాఫ్ శర్మ, స్టేషన్ మేనేజర్ కమలాకర్, టీఎంఆర్‌లు, లోకోపైలెట్లు, స్టేషన్ మాస్టర్లు, సిగ్నల్ డిపార్టుమెంట్ సిబ్బంది పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న సీనియర్ డీఓఎం శ్రావణ్ కుమార్

డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మిద్దాం

జిల్లా ఎస్పీ కృష్ణారావు

పీలేరు రూరల్ : డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మిద్దామని జిల్లా ఎస్పీ కృష్ణారావు అన్నారు. మంగళవారం పట్టణంలోని ఆర్యవైశ్య కల్యాణమండపం, ఎంజీఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో హెల్మెట్ ధరించండి.. ట్రాఫిక్ నియమాలు పాటించండి కార్యక్రమంపై యువతకు అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ అతివేగం ప్రమాదకరమన్నారు. మద్యం సేవించి, సెల్‌ఫోన్‌తో మాట్లాడుతూ వాహనాలు నడపడం ప్రమాదకరమన్నారు. ద్విచక్రవాహనదారుడు హెల్మెట్ ధరించి వాహనాలు నడపాలని కోరారు. కారులో సీట్‌బెల్ట్ లేని ప్రయాణం ప్రమాదకరమన్నారు. నిర్లక్ష్యపు డ్రైవింగ్‌తో రోడ్డు ప్రమాదాల్లో ఎక్కువగా యువతే 60 శాతం పైగా చనిపోతున్నారన్నారు. విద్యార్థి దశనుంచే చెడు అలవాట్లకు దూరంగా ఉండాలన్నారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు చెప్పినట్లు విని ఉజ్వల భవిష్యత్తుకు బంగారు బాట వేసుకోవాలని సూచించారు. క్షణికావేశాలకు లోను కారాదన్నారు. యువతే దేశానికి ఆదర్శంగా నిలవాలన్నారు. ఈ కార్యక్రమంలో రాయచోటి డీఎస్పీ మహబూబ్‌బాషా, సీఐ మోహన్‌రెడ్డి, ఎస్ఐలు నరసింహుడు, రమణ, సీఏస్ఆర్ కళాశాల ప్రిన్సిపాల్ విజయభాస్కర్‌రెడ్డి, బోదే షావలి, మురళీధర్‌రాజు, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ కృష్ణారావు

ఇంటిపై నుంచి కింద పడి బేల్దారి మృతి

కమలాపురం : కమలాపురం పట్టణంలోని రాం నగర్‌లో మంగళవారం ఇంటి పై నుంచి కింద పడడంతో బేల్దారి గాండ్లపాటి పుష్పరాజు (38) మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయి. కమలాపురం పట్టణంలోని రాం నగర్‌లో నివాసముంటున్న అవివాహితుడైన గాండ్లపాటి పుష్పరాజు బేల్దారి పనులు చేసుకుంటూ జీవనం సాగించేవాడు. నిత్యం లాగే మంగళవారం రాంనగర్ కాలనీలో జరుగుతున్న ఇంటి నిర్మాణ పనులకు వెళ్లాడు. అక్కడ నిర్మాణంలో ఉన్న భవనంపైన పనులు చేస్తూ ప్రమాదవశాత్తూ అదుపుతప్పి కింద పడి తీవ్రంగా గాయపడ్డాడు. తోటి బేల్దార్లు, కూలీలు చికిత్స కోసం అతనిని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే అతడు మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. కాగా పుష్పరాజుకు మూర్ఛ వ్యాధి ఉందని, పని చేసే సమయంలో మూర్ఛ రావడం వలన కింద పడి మృతి చెందినట్లు బంధువులు తెలిపారు.

సంతోష్‌ట్రోఫీకి కడప కుర్రాడు

కడప స్పోర్ట్స్ : కడప నగరానికి చెందిన ఫుట్‌బాల్ క్రీడాకారుడు సయ్యద్ ముక్తార్‌కు ఫుట్‌బాల్ క్రీడలో ప్రతిష్టాత్మకంగా భావించే సంతోష్‌ట్రోఫీలో పాల్గొనే అవకాశం లభించింది. ఈనెల 14 నుంచి 25వ తేదీ వరకు మహారాష్ట్రలోని కోలాపూర్‌లో నిర్వహిస్తున్న ఆలిండియా ఫుట్‌బాల్ మీట్ సంతోష్ ట్రోఫీలో పాల్గొనే ఆంధ్రప్రదేశ్ జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్నాడు. ఈనెల 1 నుంచి 12వ తేదీ వరకు నెల్లూరులో నిర్వహించిన ప్రత్యేక క్యాంపులో ఈయన ప్రతిభ కనబరచడంతో సంతోష్‌ట్రోఫీలో పాల్గొనే ఏపీ జట్టుకు ఎంపిక చేశారు. జిల్లా క్రీడాకారులు సంతోష్‌ట్రోఫీకి ఎంపికవడం పట్ల జిల్లా ఫుట్‌బాల్ సంఘం అధ్యక్షుడు ఎం. డానియల్ ప్రదీప్, కార్యదర్శి ఎం. సుధీర్‌శ్రీ సంతోషం వ్యక్తం చేశారు.

కుల ధ్రువీకరణపత్రం.. ఇక శాశ్వతం

- కుల, ఆదాయ, నివాస ధ్రువీకరణపత్రాలు ఒక్కసారి పొందితే చాలు
- ఒరిజినల్ పోయినా అదే నంబరుపై కొత్త సర్టిఫికెట్
- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం


జగనన్న సురక్షలో లబ్ధిదారుకు సర్టిఫికెట్ అందజేస్తున్న ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాషా (ఫైల్)

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సామాజిక వర్గాలకు విద్య, ఉద్యోగం తదితర అవసరాలకు కుల ధ్రువీకరణ పత్రాలు చాలా కీలకంగా మారాయి. అయితే వీటి జారీలో ఇప్పటివరకు అనేక నిబంధనల కారణంగా ఆయా వర్గాల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటూ వచ్చారు. అయితే ఈ పరిస్థితిని గమనించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కుల, ఆదాయ, నివాస, ధ్రువీకరణపత్రాల జారీలో అనేక సడలింపులను తీసుకొచ్చారు. ఇందులో భాగంగా ఇప్పటికే జగనన్న సురక్ష కార్యక్రమాన్ని చేపట్టి అర్హులైన వారందరికీ ఇంటి ముంగిటకే ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. అంతటితో ఆగకుండా మరోసారి కుల ధ్రువీకరణ పత్రాన్ని ఒకసారి పొందితే దానిని శాశ్వత పత్రంగా పరిగణించాలని అన్ని ప్రభుత్వ శాఖలకు ఆదేశాలు జారీ చేశారు.

ఒరిజినల్ పోతే అదే నంబరుతో కొత్త సర్టిఫికెట్

కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు తీసుకునే విషయంలో ప్రభుత్వం మరింత వెసులుబాటు కల్పించింది. ఈ క్రమంలో కుల ధ్రువీకరణ పత్రాన్ని ఒక్కసారి పొందితే చాలు దాన్ని శాశ్వత పత్రంగా పరిగణించాల్సి ఉంటుందని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈ క్రమంలోనే ప్రజలు పొందిన సర్టిఫికెట్ ఎక్కడైనా పోగొట్టుకుంటే దానికోసం మళ్లీ కొత్తగా దరఖాస్తు చేయాల్సిన అవసరం లేదు. ఇందుకు సంబంధించి గతంలో పొందిన సర్టిఫికెట్ నకలు ఉంటే దానిని తీసుకెళ్లి సచివాలయం, మీసేవా కేంద్రాలు, సీఎస్‌సీ సెంటర్లలో చూపితే దాని ద్వారా అదే నంబరుతో కొత్త సర్టిఫికెట్‌ను వెంటనే అందజేస్తారు. ఇందుకోసం కొత్తగా ఎలాంటి డాక్యుమెంట్లు సమర్పించాల్సిన అవసరం లేదు. కుటుంబంలో ఎవరు ఎలాంటి సర్టిఫికెట్ పొంది ఉండకపోతే దరఖాస్తుదారుడు ప్రస్తుతం ఈకేవైసీ చేయించుకుని తహసీల్దార్ ద్వారా ధ్రువీకరణ పత్రాన్ని పొందాల్సి ఉంటుంది. ఒకవేళ దరఖాస్తుదారుడు ఈకేవైసీ చేయించుకుని సర్టిఫికెట్ పొంది ఉంటే అతని రక్తసంబంధీకులు ఎవరైనా ఎలాంటి వెరిఫికేషన్ లేకుండా తహసీల్దార్ నుంచి ధ్రువీకరణ పత్రాలను పొందవచ్చు.

జగనన్న సురక్షలో లక్షలాది సర్టిఫికెట్లు

గత జూన్, జులై నెలల్లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా చేపట్టింది. వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు ప్రతి ఇంటిని జల్లెడ పట్టి ఎవరికి ఏ సర్టిఫికెట్ అవసరమో గుర్తించి వాటిని గ్రామ సభల్లో అందజేశారు. జిల్లా వ్యాప్తంగా 3,19,975 కుటుంబాలను సర్వే చేసి 2,86,169 కుటుంబాలకు సర్టిఫికెట్లను అందజేశారు. అత్యధికంగా కుల, ఆదాయ, నివాసాలకు సంబంధించిన సర్టిఫికెట్లు ఉన్నాయి. ప్రభుత్వ తాజా నిర్ణయంతో ఇకపై ఈ సర్టిఫికెట్లన్నీ శాశ్వత సర్టిఫికెట్లుగా గుర్తించనున్నట్లు అధికారులు తెలియజేస్తున్నారు.

ఒక్కసారి తీసుకుంటే చాలు



ఎవరైనా కుల, ఆదాయ, నివాస ధ్రువీకరణ పత్రాలను ఒక్కసారి పొందితే చాలు.. వాటిని శాశ్వత ధ్రువీకరణ పత్రాలుగా పరిగణిస్తాం. జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా అర్హులైన ప్రతి ఒక్కరికీ సర్టిఫికెట్లు జారీ చేశాం. మా పరిధిలో 71,721 సర్టిఫికెట్లను అందజేశాము. వివిధ సర్టిఫికెట్లకు దరఖాస్తు చేసుకుంటే అర్హతలను పరిశీలించి సర్టిఫికెట్ల జారీకి తగిన చర్యలు చేపడతాం.

– శివరామిరెడ్డి, తహసీల్దార్, కడప